క్లుప్తంగా

ఇంటింటికీ తాగునీరు



గొడ్డిపుట్టులో జేజేఎం పనులు ప్రారంభిస్తున్న సర్పంచులు, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ నర్సీపుట్టు, గొడ్డిపుట్టు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.12లక్షలతో తాగునీటి పైపులైన్ పనులకు మంగళవారం సర్పంచ్‌లు రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తోందన్నారు. తాగునీటి కష్టాలు తీరినట్టు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పాఠశాల స్వర్ణోత్సవాలకు విరాళాల వెల్లువ

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17 తేదీల్లో జరుగనున్న స్వర్ణోత్సవాల నేపథ్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఒక్కరొక్కరుగా విరాళాలు ఇస్తున్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 65వేలు అందజేసినట్లు స్వర్ణోత్సవ కమిటీ కోశాధికారి కృష్ణవర్మ తెలిపారు. అలాగే 1986–87 బ్యాచ్ విద్యార్థులు కూడా రూ. 13వేలు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరామచంద్రరాజు, శివాజీరాజు, భాస్కర్, లక్ష్మణాచారి, రామకృష్ణ, కృష్ణ, లోవరాజు, వర్మ, కాశీ, సత్యనారాయణ, మరిణీ రాజు, లతీఫ్, శ్రీనివాస్, దత్తాత్రేయ, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో సహకరించండి



వివిధ పార్టీల నేతలతో సమావేశమైన తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు బీఎల్వోలకు సహకరించాలని రాజవొమ్మంగి తహసీల్దార్ వై.వి. సుబ్రహ్మణ్యాచారి కోరారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో సుమారు 400 పేర్లను సరిచేయాల్సి ఉన్నట్టు గుర్తించగా శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌కు 200 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఓటు జాబితాలో సవరణలకు చెంది ఇంకా 200 పేర్లు ఉన్నాయన్నారు. అదే విధంగా కొన్ని బూత్‌లలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, వారిని పిలిపించి జాబితా సరిదిద్దే పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్షపత్రి పూజ



ఆలయంలో లక్షబిల్వార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం లక్షపత్రి పూజ వైభవంగా జరిగింది. ఆలయంలో గల మహిశివునికి వేద పండితులు భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు. అదే విధంగా అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. కార్తీకమాసం పుణ్యతిథులు కావడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

కళా ఉత్సవ్‌కు అరిపాక విద్యార్థులు

సబ్బవరం: ఈ నెల 11, 12 తేదీల్లో భీమిలి డైట్ కళాశాలలో జరగనున్న కళాఉత్సవ్‌లో ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొంటారని ఉపాధ్యాయురాలు రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారన్నారు. శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, చిత్రలేఖనం తదితర అంశాలమీద పోటీలు నిర్వహస్తున్నారు. పోటీలో మొదటి స్థానంలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు,మెడల్ తో పాటు అవార్డులు ఇస్తారని ఆమె తెలిపారు.



గిరిజనులకు పట్టాభిషేకం

- గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు
- రైతు భరోసా పథకంతో పెట్టుబడి సాయం
- కొనసాగుతున్న సర్వే
- ఆనందంలో గిరిజనం

దశాబ్దాలుగా మన్యంలో గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. టీడీపీ హయాంలో గిరిజనులకు తీరని అన్యాయం జరిగింది. ఎటువంటి పథకాలు అందేవి కావు. ఏళ్ల తరబడి కష్టపడినా సాగు హక్కు మాత్రం పొందలేకపోయారు. ఏదైనా ప్రకృతి విపత్తు వల్ల పంట నష్టపోతే వారికి ఎటువంటి పరిహారం అందేది కాదు. ఏడాది పొడవుగా వారు పడిన శ్రమ వృథా అవుతుండేది. అదంతా గతం.. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు వారి సాగు భూములపై హక్కులు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడవుల్లో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు హక్కును కల్పించే చరిత్రాత్మ నిర్ణయం తీసుకున్నారు. దీంతో దశాబ్దాల నాటి గిరిజనుల కల సాకారమైంది. పోడు సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం వర్తించడంతో గిరిజనుల ఆనందానికి అవధుల్లేవు.

చింతపల్లిరూరల్:. వ్యవసాయం చేస్తు భూమి మీద హక్కు లేని గిరిజనుల కల సాకారమైంది. ఎన్నో ఏళ్లుగా ఫారేస్ట్ భూముల్లో వ్యవసాయం చేసుకుంటు పట్టా లేని చాలామంది గిరిజనులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ పట్టాల ద్వారా గిరిజనులకు శాశ్వత భూహక్కు కల్పించింది. దీంతో పాటు సాగు చేసేందుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకాన్ని అమలుచేసి ఆసరాగా నిలుస్తోంది. బ్యాంకు రుణాలు పొందే అవకాశం కల్పించింది.ఐటడీఏ పరిధిలో వేలాది ఎకరాల్లో పోడు సాగు పట్టాలను పంపిణీ చేస్తోంది. మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను సుమారు 80వేల జనాభా ఉంది. వీరిలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలకు అర్హులైన వారిని ప్రభుత్వం సర్వే చేపట్టి వారికి ఏడు విడతలుగా పట్టాలు అందించింది. తద్వారా రైతులకు భూమిపై పూర్తి హక్కు కల్పించి సాగు చేసుకోనేందుకు చర్యలు తీసుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 8342 మంది లబ్ధిదారులకు 14694 ఎకరాల్లో పట్టాలు అందజేసింది. దీంతో పాటు ఫలసాయం పొందే హక్కును ప్రభుత్వం కల్పించింది. ఏళ్ల నాటి కల సాకారమవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.





వేర్వేరు ప్రాంతాల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులతో అధికారులు

- చింతపల్లి మండలంలో తాజంగి పంచాయతీలో 5828 మంది జనాభా ఉన్నారు.వారిలో 603 మందికి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది.దీని ద్వారా 704 ఎకరాల భూమికి శాశ్వత భూ హక్కు కల్పించింది.
- గొందిపాకలు పంచాయితీలో 3677 మంది జనాభా నివసిస్తున్నారు.వారిలో 575 మందికి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది.దీని ద్వారా 825 ఎకరాల భూమికి శాశ్వత భూ హక్కు కల్పించింది.
- కొత్తపాలెం పంచాయితీలో 2500 మంది జనాభా నివసిస్తున్నారు.వారిలో 750 మందికి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది.దీని ద్వారా 900 ఎకరాల భూమికి శాశ్వత భూ హక్కు కల్పించింది.
- బెన్నవరం పంచాయతీలో 3565 మంది జనాభా నివసిస్తున్నారు.వారిలో 318 మందికి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది.దీని ద్వారా 456 ఎకరాల్లో భూ హక్కు కల్పించింది.
- ఎర్రబొమ్మలు పంచాయితీలో 850 మందికి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది.దీని ద్వారా 1300 ఎకరాల భూమికి సాస్వత భూ హక్కు కల్పించింది.



పట్టాలు అందజేస్తున్న అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ అనూషదేవి, నేతలు



పట్టాలతో లబ్ధిదారులు

మండలం	:	చింతపల్లి
పంచాయతీలు	:	17
గ్రామాలు	:	245
జనాభా	:	80000
గ్రామ సచివాలయాలు	:	22
ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల లబ్ధిదారులు	:	8342
ఎకరాలు	:	14694

ఆనందంగా ఉంది



సాగుభూమిపై హక్కు లేక ఇబ్బంది పడేవారం. పంట నష్టం జరిగితే పరిహారం ఉండేది కాదు. నేడు జగనన్న ప్రభుత్వం పోడు భూముల్లో సాగు చేసుకునే మాలాంటి వారికి హక్కు ఇవ్వడం హర్షణీయం. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా లు మంజూరు చేసి మా జీవితాలను మార్చారు. చాలా ఆనందంగా ఉంది.

– రామారావు, చెరువూరు, బలపం పంచాయతీ

పట్టాలతో ఎంతో మేలు



పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలు పంపిణీ చేసి హక్కులు కల్పించడం వలన ఎంతో మేలు జరగుతుంది. సంభందిత భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులను ప్రభుత్వం కల్పించింది. ఇకపై వారు నిశ్చింతగా భూములను సాగు చేసుకోవచ్చు.

– పాత్రుడు, తహసీల్దార్, చింతపల్లి

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



వెలగలపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు



పెదార్యాకురులో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రంగమ్మ, నేతలు

కొయ్యూరు: మండలంలోని వెలగలపాలెంలో ఎంపీపీ బడుగు రమేష్ మంగళవారం పర్యటించారు. గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏపీ ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుందన్నారు. వెలగలపాలెం సచివాలయం పరిధిలో రూ.5.69 కోట్ల నిధులు వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయన్నారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ పథకాల నిధుల మంజూరు వివరాలు తెలిపిన బోర్డును, వైఎస్ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, పార్టీ జిల్లా కార్యదర్శిసత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ సుధాకర్, సర్పంచ్ రత్నకుమారి, సత్యనారాయణ, వార్డు సభ్యులు జోగిరాజు, సరస్వతి, రాంబాబు, సత్తిబాబు, కన్వీనర్లు హర్ష, వెంకటేష్, కొండబాబు, గృహ సారథులు భీమరాజు, గౌరీదేవి, రేణుక, పద్మాజీ, శివాజీ, రత్నకుమారి, పద్మ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ అన్నారు. పెదార్కూరు సచివాలయంలో సోమవారం రాత్రి పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, నిధుల మంజూరు తదితర విషయాలను గ్రామస్తులకు వివరించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.13.11 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, భరత మూర్తి, పూసం ప్రసాద్, అప్పారావు, రత్తయ్య, శైలజ, నాగు, ధర్ముల రాము, కూరా సంసురు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు నగదు, నిత్యావసర సరకులు అందజేస్తున్న పార్టీ శ్రేణులు

మారేడుమిల్లి: మండలంలోని సున్నంపాడు పంచాయతీ పరిధిలోని తుర్రూరు గ్రామానికి చెందిన వలంటీర్ పల్లాల సోమిరెడ్డి పూరిల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సర్వం కోల్పోయి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. వీరికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చేయూత అందించారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.12.500 నగదు, రూ.7,500 విలువ చేసే నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం, శాశ్వత గృహ నిర్మాణం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు హామీ ఇచ్చినట్టు తెలిపారు. పార్టీ కార్యదర్శి బోడ్డేటి గంగరాజు, వైస్ సర్పంచ్ వీరబాబు, ఏఎంసీ డైరక్టర్ దూడ స్మిత్, సచివాలయం కన్వీనర్ కృష్ణా రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి



అరకులోయలోని సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్



గొడిపుట్టు గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

అరకులోయ రూరల్: మండలంలోని బొండం, సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ తదితరులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుకుంపేట మండలంలో ఈనెల 13న చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో భారీగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధికార మాజీ ప్రతినిధి శెట్టి అప్పాలు, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, నాయకులు నర్సింగ్, రామ్మూర్తి,, బలరాం, సోమేష్, గురుమూర్తి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ గొడ్డిపుట్టు, తోటపుట్టు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న హుకుంపేటలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో స్థానికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే గిరిజన ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందని, ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ,ప్రజల్లో జగనన్న ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందన్నారు. సర్పంచులు రమేష్, బాబూరావు, నేతలు మూర్తి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో కుండపోత

- మిచాంగ్ తుఫానుతో ఎడతెరిపి లేకుండా వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు



గొడ్డిపుట్టులో రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



చింతరేగుపల్లిలో పొగాకు చేనులో చేరిన వర్షం నీటిని కిందికి మళ్లిస్తున్న రైతులు



తూటంగి గ్రామంలో వరి కుప్పలకు టార్పాలిన్లు కప్పిన ఉన్న దృశ్యం



దుశ్చర్లలో రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయ సహాయకుడు



దోనెలపల్లి కూలిన ఇంటి శ్లాబ్

ముంచంగిపుట్టు/జీకే వీధి : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో అల్లూరి జిల్లాలోని మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో శివారు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు కొద్దిపాటి అంతరాయం కలిగింది. సెల్‌సిగ్నల్స్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. మండలస్థాయి అధికారులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తమయ్యారు. తహసీల్దార్లు, మండల వ్యవసాయ శాఖాధికారులు తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్రమాదకర గెడ్డలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరిస్తున్నారు.ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపడుతున్నారు.

ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు రమేష్, బాబూరావు తదితరులు పర్యటించారు. వరద బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

డుంబ్రిగుడ: మండలంలోని కురుస్తున్న వర్షాలకు చాపరాయి, సంపంగి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. వరి పంటలపై టార్పాలిన్లు వేసి భద్రపరుస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు రైతులకు పలు సూచనలిచ్చారు.

కొయ్యూరు: మండలంలో సహాయక చర్యలను తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సీతయ్య తదితరు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన సేవలపై సిబ్బందికి ప్రత్యేక సలహాలు,సూచనలిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో తరచూ మాట్లాడి ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు

గంగవరం : మండలంలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ పర్యటించారు. వరిపంట సంరక్షణపై పలు సూచనలిచ్చారు. 10.6 మి.మీ..వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోనెలపల్లి గ్రామంలోని నిర్మాణంలో ఓ ఇంటి ముందుభాగంగా ఉన్న శ్లాబ్ దెబ్బతింది.

వై.రామవరం: మండలంలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసులు పర్యటించారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వ ఆదేశానుసారం ముందస్తు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

రాజవొమ్మంగి: మండలంలోని పలు ప్రాంతాల్లో మండల వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు పర్యటించారు. రైతులతో మాట్లాడారు. వర్షం తగ్గిన తరువాత తడిసిన వరి పంటను ఆరుబెట్టాలని చెప్పారు. తడిసిన పనలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేసి, గింజలు మొలకెత్తకుండా జాగ్రత్తపడాలని సూచించారు. తేమశాతం పరిగణనలోకి తీసుకోకుండా రైతుల నుంచి ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు అవసరమైన గోనె సంచులను సమీపంలోని ఆర్‌బీకేల నుంచి పొందవచ్చన్నారు.

వీఆర్ పురం: మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రఘు పర్యటించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. పొలాల్లో వర్షపు నీరు లేకుండా చూసుకోవాలన్నారు. తడిసిన పనలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. మిర్చి, పొగాకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తి, కిమ్మూరు, గొంటువానిపాలెం, గొండోలు, ఎల్లవరం ప్రాంతాల్లో వ్యవసాయ సిబ్బంది పర్యటించారు. పంటల సంరక్షణపై రైతులకు సూచనలిచ్చారు.

వేపకొమ్మలు చేతపట్టి.. బురదను జల్లుకుంటూ....!

- వింత జాతరలో ఉత్సాహంగా పాల్గొన్న పురుషులు



బురదోత్సవంలో పాల్గొన్న యువకులు

రాంబిల్లి : వింత జాతరగా పేరొందిన దిమిలి బురదమాంబ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము 3 గంటల నుంచే పురుషులంతా వయసుతో సంబంధం లేకుండా వీధుల్లోకి వేపకొమ్మలు చేతపట్టి వచ్చారు. మురుగుకాలువలు, సంత బయలు వద్ద ఏర్పాటు చేసిన బురదలో వేపకొమ్మలు ముంచి బురదను ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. ఈ జాతర సమయంలో గ్రామంలోకి ప్రవేశించిన ఇతర గ్రామస్తులకు బురద జల్లి గ్రామ ఆచారాన్ని చాటుకున్నారు. దల్లమాంబ అనుపు ఉత్సవంలో భాగంగా మంగళవారం బురదమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఈ బురద ఉత్సవంలో ఆడవారికి మినహాయింపునిచ్చారు. ఉదయం 11 గంటల వరకు ఈ జాతర కొనసాగింది. అనంతరం బురద ఉత్సవంలో వినియోగించిన వేపకొమ్మలను అమ్మవారి ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. బురద ఒళ్లంతా పులుముకున్నా ఎటువంటి చర్మవ్యాధులు సోకకపోవడం అమ్మవారి మహాత్యమని, ఇందులో పాల్గొన్న వారికి సకల శుభాలు కల్గుతాయని గ్రామస్తుల విశ్వాసం.